సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 27 । ఆగస్టు । 2025



ఫెన్సింగ్ పోటీలకు ఎంపికలు

తణుకు అర్బన్: తేతలి స్టెప్పింగ్ స్టోన్స్ స్కూల్‌లో మంగళవారం జరిగిన పశ్చిమ గోదావరి ఫెన్సింగ్ పోటీల్లో వ్యక్తిగత, జట్ల ఎంపికలో 18 మంది ఎంపికయ్యారు.



డిగ్రీకి పెరుగుతున్న ఆదరణ

డిగ్రీతో కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సంపాదించేలా అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో డిగ్రీ కోర్సులకు ఆదరణ పెరుగుతోంది.
2లో ▸



గంజాయి నిందితుల అరెస్టు

పెదపాడు మండలం కలపర్రు టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీల్లో గంజాయిని గుర్తించి ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
2లో ▸

ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు

- ఉద్యోగాలు కోల్పోతున్నామని విద్యార్థుల ఆందోళన
- ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో ఇబ్బందులు
- జిల్లాలో 31 వేల మందికి రూ.138 కోట్ల బకాయి



భీమవరం: విద్యారంగాన్ని మరింత పటిష్టం చేసి పెద్ద సంఖ్యలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. తీరా అధికారం చేపట్టాక ఉద్యోగాల సంగతి పక్కన పెడితే చదువుకునే పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అటకెక్కించారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు అని యాజమాన్యాలు చెబుతుండడంతో ఉద్యోగాలు కోల్పోతున్నామని ఆందోళన చెందుతున్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్ద పీటవేసి ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ విద్యాసంస్థల కంటే మిన్నగా అభివృద్ధిచేశారు. పేదలు సైతం ఉన్నత విద్యనభ్యసించేలా మౌలిక వసతులు కల్పించడమేగాక ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన వంటి అనేక పథకాలను సక్రమంగా అమలు చేశారు. మనబడి నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర గడిచిపోతున్నా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా చెల్లించకపోవడంతో అప్పులు చేసి ఫీజు బకాయిలు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది.

జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం పట్టణాలతోపాటు అనేక చోట్ల ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యనభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆయా విద్యా సంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించడంతో విద్యార్థులు చక్కగా విద్యాభ్యాసంపై దృష్టిపెట్టి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉద్యోగావకాశాలు పొందారు. కూటమి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా పాత బకాయిలతోపాటు ప్రస్తుత విద్యాసంవత్సరానికి సుమారు 31 వేల విద్యార్థులకు దాదాపు రూ.138 కోట్లు విద్యా, వసతి దీవెన బకాయిలు చెల్లించాల్సి ఉంది. కేవలం కొంతమంది విద్యార్థులకు మాత్రమే దాదాపు రూ.18 కోట్లు విడుదలైనట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వం ఆయా కళాశాలలకు పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్స్ తీసుకోడానికి వెళ్తే.. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామంటూ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందిపెట్టాయి. అనేక మంది ఉద్యోగాలు కోల్పోయిన సందర్భాలున్నాయి. పెద్ద మొత్తంలో ఫీజు బకాయిలు చెల్లించడానికి తమ వద్ద సొమ్ములు లేవని అప్పులు చేయాలంటే సాధ్యం కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి చదివినా సర్టిఫికెట్లు పొందలేకపోవడంతో కూలీ పనులకు వెళ్లాల్సి వస్తుందని ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తే చిన్నదో పెద్దదో ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా ఉండేవారమని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తే ఊరట కలుగుతుందని చెబుతున్నారు.

ఫీజులు చెల్లించాలంటున్న యాజమాన్యం



భీమవరంలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశాను. విద్యాదీవెన, వసతి దీవెన మొదటి ఏడాదికి మాత్రమే సొమ్ములు వచ్చాయి. ద్వితీయ సంవత్సరం ఒక విడత సొమ్ములు వచ్చాయి. దాదాపు రూ.12 వేలు బకాయిలు రావల్సి ఉంది. ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే సరిఫికెట్స్ ఇస్తామని కళాశాల యాజమాజ్యం చెబుతుంది.

– డి.లక్ష్మీరాజ్, భీమవరం

కళాశాల యాజమాన్యం నుంచి ఒత్తిడి



నేను తృతీయ సంవత్సరం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాను. మొత్తం రూ.11,250 ఫీజు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం కేవలం రూ.3,750 మాత్రమే ఇచ్చింది. మిగిలిన సొమ్ములు ఎప్పుడు వేస్తారో తెలియడం లేదు. కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లించాలని ఒత్తిడి తెస్తోంది.

– ధీరజ్, నరసాపురం, డిగ్రీ విద్యార్థి

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఇబ్బందులు



పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో అనేకమంది డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారు. ఫీజులు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామంటూ అనేక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నాయి. ప్రభుత్వం తక్షణం నిధులు విడుదల చేయకుంటే పోరుబాట తప్పదు.

– టి.ప్రసాద్, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి

కలెక్టరేట్ తరలింపును అడ్డుకుంటాం



భీమవరంలో మాట్లాడుతున్న కవురు శ్రీనివాస్, వెంకటరాయుడు తదితరులు

భీమవరం: భీమవరం నుంచి కలెక్టరేట్‌ను తరలించే ప్రయత్నాలను వైఎస్సార్‌సీపీ అడ్డుకుంటుందని, కలెక్టరేట్‌ను తరలించాలని చూస్తే ప్రజా ఉద్యమం చేపడతామని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం రాయలంలోని వైఎస్సార్‌సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు నివాసంలో విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, వెంకటరాయుడు, పార్టీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల మాట్లాడారు. అప్పట్లో అన్ని నియోజకవర్గాల ప్రజా ప్రతినిధుల ఆమోదంతో భీమవరం జిల్లా కేంద్రంగా ఏర్పడితే నేడు తరలించే ప్రయత్నాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తాయన్నారు. కలెక్టరేట్ భవన నిర్మాణాలకు 20 ఎకరాల భూమి, రూ.100 కోట్ల నిధులు మంజూరు జరిగితే ఎందుకు మార్చాలని చూస్తున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతోనే మార్పు అంశం తెరపైకి తీసుకువచ్చారని ఆరోపించారు. పెదఅమిరంలో పోరంబోకు స్థలంలో కలెక్టరేట్ భవనాల నిర్మాణ ప్రతిపాదించడం నిబంధనలకు, సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు, జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, యూత్ వింగ్ అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, పార్టీ నాయకులు ఏఎస్ రాజు, గాదిరాజు రామరాజు, జిల్లా కొండయ్య, పాలవెల్లి మంగ, కోడే యుగంధర్, గంటా సుందరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాంనాయుడు మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపినట్లు మంగళవారం ఒక ప్రకటనలో ఆయన వెల్లడించారు.

కలెక్టరేట్ ఎక్కడికీ తరలిపోదు

ఎమ్మెల్యే అంజిబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: భీమవరం నుంచి కలెక్టరేట్ తరలిపోతుందనేది కేవలం అపోహ మాత్రమేనని త్వరలో 25 ఎకరాల్లో అన్ని హంగులతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం నిర్మాణం జరుగుతుందని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోనే కలెక్టరేట్ ఉంటుందన్నారు. కలెక్టరేట్ అందరికీ ఉపయోగకరమైందని, అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండాలంటే సుమారు 25 ఎకరాలు స్థలం కావాల్సి ఉందని, దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, తాడేరులో స్థలాలు చూస్తున్నామన్నారు.

ఆరోగ్య పింఛన్‌లో 165 మంది అనర్హులు

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలో పెన్షన్ రీ అసెస్‌మెంట్ కార్యక్రమం కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్య పింఛన్ 1,510 మంది పొందుతున్నారని తెలిపారు. వీరిలో 165 మందిని అనర్హులుగా గుర్తించారన్నారు. 85 మందిని వృద్ధాప్య పెన్షన్‌లకు అర్హులుగా గుర్తించారన్నారు. దివ్యాంగుల పెన్షన్‌లకు సంబంధించి 27,591 మంది పొందుతుండగా, ఇప్పటి వరకు 15,532 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. వీరిలో 1817 మంది అనర్హులుగా గుర్తించగా, 181 మందిని వృద్ధాప్య పెన్షన్‌లకు అర్హులుగా గుర్తించామని కలెక్టర్ తెలిపారు.

సంచార జాతులు కాదు విముక్తి జాతులం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంచార జాతుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్ర వీరన్న

ఆకివీడు: బ్రిటీష్ సంకెళ్లను తెంచుకుని విముక్తి పొందిన సంచార జాతులకు 1952 ఆగస్టు 31న విముక్తి దినోత్సవాన్ని భారత ప్రభుత్వం ప్రకటించిందని ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న అన్నారు. మండలంలోని తాళ్లకోడు శివారు ప్రాంతంలో నివశిస్తున్న గంగిరెద్దు కులస్తుల్ని సోమవారం రాత్రి ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 30న భీమవరంలోని పార్కు సమీపంలోని అంబేడ్కర్ భవనం వద్ద జరిగే స్వాతంత్ర దినోత్సవ పోస్టరును ఆవిష్కరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని సంచార జాతులంతా ఈ సభకు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఫ్రీ బస్సుతో మా జీవితాలు ఛిన్నాభిన్నం

కైకలూరు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో తమ జీవితాలు ఛిన్నాభిన్నమయ్యాయని సీఐటీయూ ఆధ్వర్యంలో నియోజకవర్గం నాలుగు మండలాల ఆటో డ్రైవర్లు ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఏలూరు జిల్లా ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి జినగం గోపి మాట్లాడుతూ ఫ్రీ బస్సు పథకంతో నష్టపోయిన ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.25,000 అందించాలని డిమాండ్ చేశారు. కరోనా కారణంగా ఇప్పటికే డ్రైవర్లు నష్టపోయారని, ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేక అప్పులు పాలయ్యారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహన మిత్ర పథకంలో రూ.10 వేలు ఇవ్వగా తామొస్తే రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి హామీ నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం స్పందించపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మండలాలకు చెందిన ఫ్రెండ్స్, భరత్, కొండాలమ్మ, శ్యామలాంబ, ఆది వినాయక, భక్తాంజనేయ ఆటో వర్కర్ల యూనియన్ల అధ్యక్షులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పంటు ప్రయాణికులపై బాదుడు

- చించినాడ వంతెన మూసివేతతో పంటుపై పెరిగిన రద్దీ
- జేబులు నింపుకుంటున్న కాంట్రాక్టర్



పంటుపై వెళుతున్న ప్రయాణికులు

నరసాపురం: వశిష్ట గోదావరి రేవులో పంటు ప్రయాణికుల నుంచి ఇష్టానుసారం చార్జీలు వసూలు చేస్తున్నారు. పంటు ఎక్కిన ప్రయాణికుల జేబులు గుల్ల చేస్తున్నారు. పంటు కాంట్రాక్టర్ చార్జీలు పెంచి వసూలు చేస్తున్నా అధికారులు మౌనంగా ఉండడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాలను కలుపుతూ యలమంచిలి మండలంలో ఉన్న చించినాడ వంతెన మరమ్మతుల కారణంగా గత నాలుగురోజుల నుంచి మూసేశారు. దీంతో గోదావరి జిల్లాల మధ్య ప్రయాణించడానికి నరసాపురం వశిష్ట గోదావరి రేవు దాటడం తప్ప మరో మార్గం లేదు. దీంతో రేవు వద్ద నాలుగురోజులుగా రద్దీ పెరిగింది. దీనిని పంటు నిర్వాహకులు డబ్బులు దండుకోవడానికి మంచి అవకాశంగా మలుచుకున్నారు. బైక్‌కు రూ.30 వసూలు చేయాలి. నాలుగు చక్రాల వాహనానికి రూ.130 వసూలు చేయాలి. బైక్‌కు రూ.50 నుంచి రద్దీని బట్టి రూ.100 వరకూ వసూలు చేస్తున్నారు. కారుకు రూ.200 నుంచి రూ.300 వరకూ వసూలు చేస్తున్నారు. లోడు వాహనాలకు రూ.500 వరకూ వసూలు చేస్తున్నారు.

రాత్రి 11 గంటల వరకూ పంటు నిర్వహణ

ప్రత్యామ్నాయ మార్గం లేక, ప్రయాణికులు పంటులోనే ప్రయాణించాల్సి వస్తోంది. వినాయకచవితి పండుగ నేపథ్యంలో రద్దీ పెరిగింది. దీంతో చార్జీలు పెంచి వసూలు చేస్తూ దండుకుంటున్నారు. రేవులో రెండు పంటులు మాత్రమే నడపడానికి అనుమతి ఉంది. రేవు నిర్వాహకులు ప్రమాదకర పరిస్థితుల్లో ఏకంగా మూడు పంటులు తిప్పుతున్నారు. పంటుపై పరిమితికి మించి జనాలను ఎక్కిస్తున్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా రాత్రి పూట పంటు తిప్పడానికి అనుమతిలేకున్నా, రాత్రి 11 గంటల వరకూ కూడా పంటు నడుపుతున్నారు. పంటుపై లైఫ్ జాకెట్లు లాంటి రక్షణ పరికరాలు సరిపడా లేకుండా ప్రయాణికుల భద్రతను గాలికొదిలేశారు.

● మార్కెట్‌లో చవితి సందడి





పాలకొల్లు మహాత్మా గాంధీ రోడ్డులో సందడి వాతావరణం

ఊరూవాడా వినాయక చవితి సందడి నెలకొంది. చవితి సామగ్రి విక్రయాలతో జిల్లాలోని మార్కెట్లు కిటకిటలాడాయి. పత్రి, పూలు, పండ్లు, ప్రతిమలు, పూజా ద్రవ్యాల అమ్మకాలు జోరుగా సాగాయి. -సాక్షి నెట్‌వర్క్



పూజా సామగ్రి అమ్మకాలతో సందడిగా ఉన్న నరసాపురం మార్కెట్



తాడేపల్లిగూడెంలో మట్టి విగ్రహాలు విక్రయిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీల సమస్యలు పట్టవా?

- కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి
- పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల ఆందోళన
- కొత్త ఫోన్లు ఇస్తేనే పనిచేయగలమంటున్న అంగన్‌వాడీలు



ఏలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట పనిచేయని సెల్ ఫోన్లు చూపుతున్న అంగన్‌వాడీలు(ఫైల్)

ఏలూరు (టూటౌన్): సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అయినా పాలకులు పట్టించుకోకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, గత సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నారు. 2014 తర్వాత కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదని గుర్తు చేస్తున్నారు. గత సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు తక్షణం అమలు చేయాలని కోరుతున్నారు.

పనిచేయని సెల్‌ఫోన్లతో ఎలా పనిచేయాలి?

పనిచేయని సెల్ ఫోన్లతో ఎలా విధులు నిర్వర్తించాలని ప్రశ్నిస్తున్నారు. పని భారం విపరీతంగా పెంచిన ప్రభుత్వాలు వేతనాలు మాత్రం పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచడానికి మీన మేషాలు లెక్కిస్తున్నాయని విమర్శిస్తున్నారు. గ్రాట్యుటీ కోసం ఇచ్చిన జీవోలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు పనిచేయని తమ సెల్‌ఫోన్లను ఐసీడీఎస్ కార్యాలయాల్లో అప్పగించారు. కొత్త ఫోన్లు ఇవ్వాలని లేదంటే యాప్‌లు రద్దు చేయాలని వేడుకుంటున్నారు. యాప్‌లపై కనీస శిక్షణ ఇవ్వకుండా, యాప్‌లు సపోర్టు చేసే ఫోన్‌లు అందించకుండా మెడపై కత్తి పెట్టి పని చేయమంటే ఎలా చేసేదంటూ ఆక్రోశిస్తున్నారు. అంగన్వాడీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన రెండు యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. సిగ్నల్స్ పని చేయక, పాత ఫోన్లు కావడంతో అప్‌లోడ్ చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 3,851 మంది అంగన్‌వాడీలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో మొత్తం 3,851 మంది అంగన్‌వాడీలు పనిచేస్తున్నారు. అదే సంఖ్యలో సహాయకులు పనిచేస్తున్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా పది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 2,225 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 1,959 మెయిన్ సెంటర్లు, 206 మినీ సెంటర్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 1626 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 1556 మెయిన్ సెంటర్లు, 70 మినీ సెంటర్లు పనిచేస్తున్నాయి.

లబ్ధిదారులకు ఇబ్బందులు

ఫేస్ క్యాప్చర్ అయితేనే లబ్ధిదారులకి ఆహారం ఇవ్వాలి. దీని వల్ల లబ్ధిదారులు నష్టపోతున్నారు. గతంలో కుటుంబంలో ఎవరు వచ్చినా ఇవ్వడానికి ఉండేది. ఇప్పుడు లబ్ధిదారురాలు మాత్రం వస్తేనే ఇవ్వాలి.. ఒకపక్క కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌కు నిధులు తగ్గించుకుంటూ పోతుంది. నాణ్యమైన ఆహారం ఇవ్వడం లేదు. కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గించుకోవడం కోసం లబ్ధిదారులకు పౌష్టికాహారంపై కోత పెడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. అంగన్‌వాడీకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. టార్గెట్ల పేరుతో అంగన్‌వాడీలను తీవ్రంగా వేధిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. అంగన్‌వాడీలపై వేధింపులు తక్షణం ఆపాలి. లేని పక్షంలో వారికి అండగా సీఐటీయూ పోరాటం చేస్తుంది.

– డీఎన్‌వీడి ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

పెరిగిన నిత్యావసరాలతో ఇబ్బందులు



ప్రస్తుతం చెల్లిస్తున్న చాలీ చాలని వేతనాలు, మరో పక్క పెరిగిన నిత్యావసరాల ధరలతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఫేస్ క్యాప్చర్‌తో నిమిత్తం లేకుండా రేషన్ అందించే వెసులుబాటును అధికారులు కల్పించాలి. నెట్, సిగ్నల్స్ లేక పోవడం, సర్వర్ పనిచేయకపోవడం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– పి.సుజాత, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు

సమ్మె ఒప్పందాలను అమలు చేయాలి



గత కాలపు సమ్మె ఒప్పందాలను తక్షణం అమలు చేయాలి. గ్రాట్యూటీ కోసం ఇచ్చిన జీవోల్లో మార్పులు చేయాలి. పాత ఫోన్లలో రెగ్యులర్‌గా చేయాల్సిన యాప్‌ల అప్‌లోడ్‌తో అవస్థలు పడుతున్నాం. అసలు ఫోన్లలో లేని స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర యాప్‌లను అధికారులు చేయిస్తున్నారు. మరో పక్క పాత ఫోన్లలో పీడీఎఫ్ ఫైల్స్ ఓపెన్ కావడం లేదు.

– పి.భారతి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న బి.బలరాం

ఏలూరు (టూటౌన్): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలని, ప్రజల హక్కును కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ జిల్లా విస్తృత సమావేశం కార్యదర్శి వర్గ సభ్యుడు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన ఏలూరులో మంగళవారం జరిగింది. సమావేశంలో పలు ప్రజా సమస్యలపై తీర్మానాలు చేశారు. బలరాం మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని, కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు, ప్రతిపక్ష పార్టీ ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రశ్నించడానికి జనసేన పుట్టిందన్న పవన్.. ప్రశ్నిస్తే అణచివేస్తామంటున్న బీజేపీతో కలిసి విశాఖ ఉక్కు పరిశ్రమకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, పి రామకృష్ణ, కే శ్రీనివాస్ పాల్గొన్నారు.

బదిలీలకు దరఖాస్తులు సమర్పించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్ జిల్లాల బదిలీల కోసం అభ్యర్థనలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రాసెస్ చేస్తామని, అర్హత, ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు లీప్ యాప్‌లో అంతర్ జిల్లాల బదిలీల కోసం దరఖాస్తులు సమర్పించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని దరఖాస్తు ఫారం ప్రింట్ సంబంధిత మండల విద్యాశాఖాధికారికి ఈ నెల 27వ తేదీ వరకూ సమర్పించవచ్చన్నారు.

డిగ్రీ చదువుకు పెరుగుతున్న ఆదరణ

- నూతన కోర్సులతో లక్షల వేతనాలతో ఉద్యోగాలు
- విద్యార్థులను ఆకర్షిస్తున్న వినూత్న కోర్సులు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చదువుకు అంతిమ లక్ష్యం మంచి ఉద్యోగాలు సాధించడమే అన్నట్టుగా యువత ఆలోచనా విధానం మారిపోయింది. ఏ కోర్సులు చేస్తే ఏ ఉద్యోగాలు వస్తాయో? ముందుగానే తెలుసుకోవడానికి, అత్యధిక జీతాలు వచ్చే అవకాశాలు ఉన్న కోర్సులను ఎంపిక చేసుకోవడానికి యువత ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా ఇంజనీరింగ్ కోర్సులతో తక్కువ సమయంలో ఉద్యోగావకాశాలు పొందుతున్న ట్రెండ్ ప్రస్తుతం నడుస్తోంది. అది కూడా కంప్యూటర్ ఆధారిత కోర్సుల వైపే ఎక్కువ మంది దృష్టి సారిస్తున్నారు. అయితే చదువులో వెనుకబడి, ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షల్లో సరైన ర్యాంకులు సాధించలేకపోయిన వారు తప్పనిసరి పరిస్థితుల్లో డిగ్రీ కోర్సులవైపు వెళ్లక తప్పడం లేదు. అయితే డిగ్రీలో కూడా కొత్త కోర్సులను ప్రవేశపెట్టి డిగ్రీ కోర్సులతో కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సంపాదించేలా విద్యార్థులకు అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం డిగ్రీ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుండడంతో విద్యార్థులు ఈ కోర్సుల వైపు కూడా అడుగులు వేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. మంగళవారంతో వెబ్ ఆప్షన్ల గడువు ముగియగా, ఈ నెల 29న వెబ్ ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉంటుంది. కొత్త కోర్సుల గురించి తెలియని వారు వాటి గురించి ఆరా తీసి నిపుణుల సలహా మేరకు వెబ్ ఆప్షన్లు మార్చుకోవచ్చు.

అందుబాటులోకి ఆనర్స్ డిగ్రీ

సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో మార్పులు రావడంతో ఆనర్స్ డిగ్రీ కోర్సులు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. మూడేళ్ల కాలానికి సాధారణ డిగ్రీ, నాలుగేళ్ల కాలానికి ఆనర్స్ డిగ్రీ సర్టిఫికెట్లు అందుబాటులోకి వచ్చాయి. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేసి, ఉపాధికి బాటలు వేసే విధంగా కోర్సులను రూపొందించారు. ఈ కోర్సుల్లో భాష, సాంకేతిక నైపుణ్యాలతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంచేలా ఇంటర్న్‌షిప్, పారిశ్రామిక శిక్షణను అంతర్భాగం చేశారు. ఇవి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు వరంగా మారాయి.

సెమిస్టర్ విధానంతో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

ప్రభుత్వ కళాశాలల్లోనూ డిగ్రీ కోర్సులు ఆంగ్ల మాధ్యమంలో అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి, ఇంటర్మీడియట్ స్థాయిల్లో ఆంగ్ల మాధ్యమంలో చదివిన విద్యార్థులు ఎలాంటి ఇబ్బందీ లేకుండా డిగ్రీలో అదే మాధ్యమాన్ని కొనసాగించవచ్చు. ఆ భాషా నైపుణ్యంతో పాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని కార్పొరేట్ కొలువులు సాధించే స్థాయికి చేరుకోవచ్చని విద్యా రంగ నిపుణులు తెలుపుతున్నారు. అలాగే సెమిస్టర్ విధానం అమలులోకి రావడం, పరీక్షలు, మూల్యాంకనం ద్వారా విద్యార్థి అభ్యసన స్థాయిని ఎప్పటికప్పుడు అధ్యాపకులు పర్యవేక్షించడం వల్ల విద్యార్థులు ఉత్తమ అవకాశాలను అందుకోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

కంప్యూటర్ ఆధారిత కోర్సులతో కొత్త పుంతలు

డిగ్రీలో కంప్యూటర్ ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టడంతో డిగ్రీ చదువులు సైతం కొత్త పుంతలు తొక్కుతున్నాయి. సంప్రదాయ కోర్సులతో పాటు కంప్యూటర్ ఆధారిత కోర్సులనూ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కోర్సుల్లో చేరి విజయవంతంగా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే ఇంజనీరింగ్‌లా నాలుగేళ్ల వరకూ ఆగక్కరలేకుండానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించే అవకాశం ఉంటుంది.

ఈ మార్పులు గమనించాల్సిందే

సంప్రదాయ కోర్సులైన బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి మార్పులు చేసింది. పీజీలోలా పూర్తిగా ఒక సబ్జెక్టు చదివేలా డిగ్రీ కరిక్యులమ్‌తోపాటు సిలబస్‌లో మార్పులు చేసింది.

- బీఎస్సీ లైఫ్‌సైన్సెస్‌లో బోటనీ, జువాలజీ, ఆక్వా కల్చర్, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, హోమ్ సైన్స్, న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ కోర్సులతో పాటు బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్ వంటి ఆధునిక కోర్సులను అందుబాటులోకి తెచ్చింది.
- బీఏలో ఫైనాన్షియల్ ఎకనామిక్స్, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరరీ స్టడీస్, తెలుగు భాష–సాహిత్యం, పొలిటికల్ సైన్స్ కోర్సులను తీర్చిదిద్దింది.
- బీకాంలో జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్ అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెనుగొండ: పెనుగొండ–అయితంపూడి రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పెనుగొండ మండలం మునమర్రుకు చెందిన తానేటి సత్యానందం(37) మృతి చెందాడు. మృతుడు పెనుగొండ నుంచి పెరవలి వెళ్తుండగా పెనుగొండ శివారు గ్యాస్ కంపెనీ గొడౌన్ వద్ద కూల్‌డ్రింక్స్ వ్యాన్ వేగంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే తుది శ్వాస విడిచాడు. మృతుడు భార్య, కుమారుడు సంతానం. కూలి పనులు చేసుకొని జీవించే సత్యానందం గత కొంత కాలంగా రామన్నపాలెంలోని మామగారి ఇంటి వద్దే ఉంటున్నాడు. మృతుని మామ దిగమర్తి ఎల్లయ్య ఫిర్యాదుతో పెనుగొండ ఎస్సై కొప్పిశెట్టి గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలుపు మందు తాగి వ్యక్తి మృతి

పెనుగొండ: అప్పులు తీర్చలేనన్న భయంతో వడలికి చెందిన ఓ వ్యక్తి కలుపుమందు తాగి ఆత్మహత్యయత్నం చేసి మంగళవారం ఆసుపత్రిలో ప్రాణాలు విడిచాడు. వడలి గ్రామానికి చెందిన సరేళ్ల రవికుమార్ అప్పు చేసి జీవనోపాధి నిమిత్తం ఇతర దేశాలకు వెళ్లాడు. పని నచ్చక ఇటీవలే తిరిగి వచ్చేశాడు. జీవనోపాధి కోల్పోయి, అప్పు రూ.4లక్షలు మిగలడంతో తీవ్ర కలత చెంది సోమవారం కలుపు మందు సేవించాడు. పెనుగొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా, పరిస్థితి విషమించడంతో తణుకు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ప్రాణాలు విడిచాడు. మృతుడికు భార్య, కుమారుడు సంతానం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ముగిసిన ఏఐ, ఎంఎల్ వర్క్‌షాప్



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న కన్వీనర్ కేకే సింగ్

నూజివీడు: స్థానిక ట్రిపుల్‌ఐటీలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వర్క్ షాప్ మంగళవారం ముగిసింది. సీఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాపులో వ్యవసాయం, ఆరోగ్యం, విజ్ఞాన శాస్త్రం, మెకానికల్ తదితర విభాగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వినియోగంపై విశ్లేషణాత్మకంగా వివరించారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న వివిధ ఆర్టిఫిషీయల్ సాంకేతిక పద్ధతులపై విద్యార్థులకు సంక్షిప్త అవగాహనను కల్పించారు. ఈ వర్క్‌షాపులో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం నుంచి ఆఖరు సంవత్సరం వరకు ప్రతిరోజూ 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో కన్వీనర్ కేకే సింగ్ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

రియాన్ష్‌కి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



కొయ్యలగూడెం: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కొల్లూరు రియాన్ష్ అనే బాలుడు చోటు సంపాదించాడు. కొయ్యలగూడేనికి చెందిన ప్రముఖ గుండె వైద్యులు డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్ కుమారుడైన కొల్లూరు రియాన్ష్ చిన్న వయసులో జాతీయస్థాయిలో అరుదైన గుర్తింపు పొందారు. రాజమండ్రిలోని ప్రైవేట్ స్కూల్లో మూడవ తరగతి విద్యనభ్యసిస్తున్న ఏడు సంవత్సరాల వయస్సు కలిగిన రియాన్ష్ 101 కౌరవుల పేర్లు అతి తక్కువ సమయం 48.10 సెకండ్‌లో అనర్గళంగా వేగంగా కచ్చితత్వంతో చెప్పి అరుదైన జాతీయస్థాయి రికార్డుని నెలకొల్పాడు.

శతాధిక వృద్ధుల సత్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శతాధిక వృద్ధులను సత్కరించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ తెలిపారు. స్థానిక దుర్గాపురంలోని విజయ్ నర్సింగ్ కళాశాలలో మంగళవారం శతాధిక వృద్ధులకు సత్కారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నూరు సంవత్సరాలు పూర్తిచేసుకున్న వృద్ధులను గుర్తించి, వారందరినీ ఒకే వేదికపై ప్రముఖుల చేతుల మీదుగా సత్కరిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 12 సార్లు 17 మంది శతాధిక వృద్ధులను గుర్తించి సత్కరించామని పేర్కొన్నారు. శతాధిక వృద్ధులు వచ్చే నెల 10లోపు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో స్వయంగా లేదా 98481 11138, 93475 72766 ఫోన్ నంబర్లలో పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

వరకట్నం వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం: భార్యను వేధిస్తున్న భర్త, ఆమె అత్తపై మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు స్టేషన్ రైటర్ బాబూరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. వివరాల ప్రకారం పాడిశెట్టి పావని లక్ష్మీప్రసన్నకు 2022లో శ్రీను అనే వ్యక్తి తో వివాహమైంది. వివాహ సమయంలో రూ. 2లక్షలు కట్నం ఇచ్చారు. అయితే ఇటీవల శ్రీను వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ప్రసన్నను అధికకట్నం భర్త, అత్త వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న పోలీసులు

పెదపాడు: గంజాయి రవాణా చేస్తున్న నిందితులను అరెస్టు చేశామని, మరికొంతమందిని త్వరలో పట్టుకుంటామని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. ఆగస్టు 25న కలపర్రు టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు ఓ వ్యానులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ వాహనంలో ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని దర్వాసి గ్రామానికి చెందిన మహ్మద్ రాజు, మహ్మద్ ఇమ్రాన్‌లను అరెస్ట్ చేశారు. హైదరాబాదుకు చెందిన వహీద్‌ఖాన్ చెప్పిన ప్రకారం రాజమండ్రి దగ్గరలోని కోరుకొండ డొంక వద్ద ఉన్న గుమ్మాలదొడ్డి గ్రామానికి వెళ్లి అక్కడ వంతల గాసీరామ్ అందించిన 65 కేజీల గంజాయిని తీసుకుని హైదరాబాద్ తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. మహ్మద్ రాజు 2014లో కొవ్వూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో 2015లో సంబంధిత కేసుల్లో తొమ్మిది సంవత్సరాలు రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించి 2024లో విడుదలయ్యాడు. మిగిలిన ముద్దాయిలను కూడా రాజమండ్రి, విశాఖ ఏజెన్సీలో ఉన్నట్లు గుర్తించామని వారిని పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో హెచ్‌సీ సుదర్శన్, పీసీలు కృష్ణప్రసాద్, నరసింహారావు, నాగార్జున పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ చాంపియన్‌గా ఏలూరు జిల్లా జట్టు



చాంపియన్‌గా నిలిచిన ఏలూరు జిల్లా జట్టు

ఏలూరు రూరల్: ఏలూరు జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్టు అమరావతి ఛాంపియన్‌గా నిలిచింది. జాతీయ క్రీడా దినోత్సవం నేపథ్యంలో స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయిలో ఆటల పోటీలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఈ నెల 23 నుంచి 26 వరకూ తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఏలూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. గత వారం పిఠాపురంలో జరిగిన జోన్‌స్థాయి పోటీల్లో గెలుపొందిన ఏలూరు జట్టు రాష్ట్రస్థాయికి అర్హత సాధించిన సంగతి తెలిసిందే. విజేతలకు ఈ నెల 29న బహుమతులు అందజేస్తారని కోచ్ కె.మురళీకృష్ణ చెప్పారు.

11, 12 తేదీల్లో జిల్లాస్థాయి కళా ఉత్సవ్ ఎంపిక పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సెప్టెంబర్ 11,12 తేదీల్లో విద్యార్థులకు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్టు దూబచర్ల డైట్ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.కమల కుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పోటల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 48 మండలాలకు చెందిన ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదివుతున్న విద్యార్థిని, విద్యార్థులకు వివిధ కళాంశాలలో వ్యక్తిగత, గ్రూపు విభాగాలలో పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రథమ, ద్వితీయ, స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.25,000, రూ.20,000, రూ. 15,000 చొప్పున నగదు బహుమతి అందజేస్తారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంట్రీలను ఎంపిక చేయడానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో సెప్టెంబర్ నెల 11వ తేదీన సంగీతం/నృత్యం, 12వ తేదీన నాటకం, డ్రాయింగ్, కథ చెప్పడం వంటి అంశాల్లో ఉదయం 10 గంటల నుంచి దూబచర్లలోని డైట్ జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రాంగణంలో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తిగల ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఇతర యాజమాన్య పాఠశాలల్లో 9 వ తరగతి నుండి 12 వ తరగతి వరకు చదివే విద్యార్థులు వ్యక్తిగతంగా కాని 4 గురు సభ్యులు మించకుండా ఉండే జట్లతో తమ పేర్లను ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 89195 59615, 99123 08303 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

కొయ్యలగూడెం: పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో మంగళవారం పలువురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వాటర్ ట్యాంక్ రామాలయం ప్రాంతంలో అలిమేలు శ్రీనివాస్ అనే వృద్ధుడిపై తౌలుత నల్లగా ఉండే కుక్క ఒకటి దాడి చేసి శరీరంపై పలుచోట్ల తీవ్రంగా కరిచింది. దీంతో శ్రీనివాసుని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లి జాయిన్ చేశారు. అదే కుక్క కన్నాపురం రోడ్డులో చిట్టిబాబు, వీరబాబు అనే ఇద్దరు యువకులపై కూడా దాడి చేసి గాయపరిచింది. మొత్తంగా మంగళవారం ఒక్క రోజునే ప్రభుత్వాస్పత్రిలో కుక్క కరవడం వల్ల ఎనిమిది మంది వ్యక్తులు చికిత్స తీసుకున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

రెండు కంపెనీలతో ఏపీ నిట్ ఎంఓయూ



నిప్పన్ కంపెనీతో ఎంఓయూ చేసుకుంటున్న నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్.వి.రమణరావు

తాడేపల్లిగూడెం: గుజరాత్‌కు చెందిన నిప్పన్ స్టీల్ ఇండియా, నామ్‌టెక్ కంపెనీలతో ఏపీ నిట్ మంగళవారం ఎంఓయూలు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ రమణరావు మాట్లాడుతూ స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, మొబిలిటీ, రోబోటిక్స్, స్పేస్ అండ్ డిజిటల్ టెక్నాలజీ, ఏఐ వంటి సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారం అందించుకునేందుకు మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా మిషన్లను బలోపేతం చేసేందుకు ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వీటితో పాటు పరిశోధనలు, ఇన్నోవేషన్లను సంయుక్తంగా నిర్వహించడానికి పాఠ్య ప్రణాళిక, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కరికులం రూపకల్పన, ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రామ్‌లు, స్టార్టప్‌లు, మెంటరింగ్ హ్యాకథాన్ నిర్వహించడానికి విద్యార్థులు నామ్‌టెక్ ఫెలోషిప్‌లు పొందడానికి కూగా ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ రవికిరణ్ శాస్త్రి, అసోసియేట్ డీన్ వినోత్‌కుమార్ రాజా, నామ్‌టెక్ ప్రోగ్రామ్ డైరెక్టర్ వెలగపూడి వాసు, అసోసియేట్ డైరెక్టర్ అకడమిక్స్ డాక్టర్ అమిత్ పటేల్, నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



పవన్‌కుమార్

దెందులూరు: బ్యాంకాక్‌లో మంగళవారం జరిగిన 57వ ఏషియన్ బాడీ బిల్డింగ్ ఫిజిక్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్–2025 పోటీల్లో కోడూరు పవన్ కుమార్ వెండి పతకం సాధించాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఏషియన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొన్న పవన్ కుమార్ దెందులూరు మండలం రామారావుగూడెం గ్రామ విద్యార్థి. ఇప్పటికే పవన్ కుమార్ జాతీయస్థాయిలో జూనియర్ ఛాంపియన్‌షిప్ విభాగంలో ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న సంగతి విధితమే.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

ముదినేపల్లి రూరల్: పురుగు మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పెయ్యేరులో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కె రాజు(32) అప్పుల బాధతో పాటు కుటుంబ సమస్యల కారణంగా మనస్థాపానికి గురై పురుగుల మందు తాగినట్లు స్థానికులు తెలిపారు. అపస్మారక స్థితిలో వెళ్లిన రాజును గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు స్థానికులు చెప్పారు. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ద్వారకాతిరుమలలో భక్తుడి బైక్ చోరీ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న దర్శనం కోసం వచ్చిన ఒక భక్తుడి బైక్ చోరీకి గురైంది. వివరాల ప్రకారం. నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన రేలంగి సత్యన్నారాయణ శ్రీవారి దర్శనార్థం తన హూండా షైన్ బైక్‌పై మంగళవారం క్షేత్రానికి వచ్చాడు. వాహనాన్ని పార్కింగ్ ప్రదేశంలో ఉంచి, దర్శనానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి

కైకలూరు: చిత్తు కాగితాలు, సీసాలు ఎరుకుంటూ చేపల చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పుటేరు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కైకలూరుకు చెందిన ముంగి పెద్దోడు(45) చిత్తు కాగితాలు సేకరిస్తూ జీవనం సాగిస్తాడు. చెరువు వద్ద ప్లాస్టిక్ సీసాలను సేకరిస్తుండగా చెరువులో జారీ పడ్డాడు. సమీపంలో మరో సహచారుడు గమనించి కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. అప్పటికే పెద్దోడు మరణించాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

చెల్లని చెక్కు కేసుల్లో జైలుశిక్ష, జరిమానా

నూజివీడు: చెల్లని చెక్కు కేసులో నూజివీడు మండలం రావిచర్లకు చెందిన పురాణం రామలక్ష్మికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూరి మంగళవారం తీర్పును వెలువరించారు. పట్టణానికి చెందిన మద్దిరాల కోటేశ్వరరావు రామలక్ష్మికి 2020 ఆగస్టు 20న రూ.5లక్షలు, 2021 ఫిబ్రవరిలో రూ.4 లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఆ తరువాత బాకీ తీర్మానం నిమిత్తం 2022 ఫిబ్రవరి 4న రామలక్ష్మి రూ.9 లక్షలకు కోటేశ్వరరావుకు చెక్కును ఇచ్చారు. ఆ చెక్కును నగదు నిమిత్తం బ్యాంకులో వేయగా రామలక్ష్మి ఎక్కౌంట్‌లో నగదు లేదని చెక్కును వెనక్కు తిప్పి పంపారు. దీనిపై కోటేశ్వరరావు కోర్టులో కేసు వేయగా న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించారు.

చెల్లని చెక్కు కేసులో నూజివీడుకు చెందిన పెనిమల నాగమల్లేశ్వరరావుకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.7లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూరి మంగళవారం తీర్పును వెలువరించారు. పట్టణానికి చెందిన నెల్లిమర్ల విఘ్నేశ్వరరావు 2019 డిసెంబరు 18న నాగమల్లేశ్వరరావుకు రూ.7లక్షలు, అప్పుగా ఇచ్చారు. ఆ తరువాత బాకీ తీర్మానం నిమిత్తం నాగమల్లేశ్వరరావు రూ. 6లక్షలకు చెక్కును ఇచ్చారు. ఆ చెక్కును నగదు నిమిత్తం బ్యాంకులో వేయగా అకౌంట్‌లో నగదు లేదని చెక్కును వెనక్కు తిప్పి పంపారు. దీనిపై విఘ్నేశ్వరరావు కోర్టులో కేసు వేయగా న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించారు.

రూ.7 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా



గొల్లలకోడేరులోని ఖాదర్ ఎక్స్‌పోర్ట్స్



పరిశ్రమలోని అక్రమ నిర్మాణాలు

పాలకోడేరు: ఎవరైనా సామాన్యుడు సెంటు భూమి ఆక్రమించుకుంటే కూల్చేసే అధికారులు రూ.7 కోట్లు విలువైన భూమిని కబ్జా చేసి దర్జాగా వ్యాపారం సాగిస్తున్న పరిశ్రమపై మాత్రం ఎక్కడ లేని జాలి, దయ, కరుణ చూపిస్తున్నారు. భీమవరం తాడేపల్లిగూడెం రహదారికి ఆనుకుని గొల్లలకోడేరులో ఖాదర్ అనే రొయ్యల పరిశ్రమ ఉంది. ఈ రొయ్యల పరిశ్రమకు చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని తెలుస్తుంది. ఈ ఆక్రమణలు గుర్తించిన గొల్లలకోడేరు పంచాయతీ అధికారులు, సర్వే సిబ్బంది గత రెండు నెలలుగా ప్రభుత్వ భూమిని అప్పగించాలని యాజమాన్యానికి నోటీసులు పంపుతున్నారు. అయితే యాజమాన్యం కనీస స్పందన లేదని ఆరోపణలు వస్తున్నాయి.

60 సెంట్ల భూమి గుర్తింపు

సర్వేలో ప్రభుత్వ అధికారులే ఈ ఖాదర్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఒకవైపు సుమారు 60 సెంట్లు ప్రభుత్వ భూముందని లెక్కలు చూపిస్తున్నారు. వాస్తవానికి ఈ ఖాదర్ ఎక్స్‌పోర్ట్స్‌లో ఇంతకన్నా ఎక్కువ భూమి ఉండొచ్చని స్థానికులు బహిరంగంగా చెబుతున్నారు.ఇక్కడ భూమి విలువ సెంటు 12 లక్షల వరకు ఉంది. ఈ లెక్కను చూసిన ఈ భూమి విలువ రూ.7 కోట్లలో ఉంది. ఇంత విలువైన ప్రభుత్వ భూమిని ఈ పరిశ్రమ ఆక్రమించుకుని దర్జాగా నిర్మాణాలు చేపడితే ప్రస్తుత పాలకులు, అధికారులు ఈ ఆక్రమణలు గుర్తించిన స్వాధీనం చేసుకునేందుకు చర్యలను వేగవంతం చేయకుండా వెనకడుగు వేస్తున్నారు.

గుర్తించడం వాస్తవమే

గొల్లలకోడేరులో ఉన్న ఖాదర్ ఎక్స్పోర్ట్ లో ప్రభుత్వ భూమిని సర్వే చేసి గుర్తించాం. ఈ భూమిని అప్పగించాలని నోటీస్ కూడా అందించాం. పరిశ్రమ వారు సరిగ్గా స్పందించడం లేదు. జిల్లా అధికారులు ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటాం. –కె.సుజాత, పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి, గొల్లలకోడేరు

క్లుప్తంగా

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో పేదలకు బియ్యం బస్తాల పంపిణీ



తణుకులో పేదలకు బియ్యం బస్తాలు అందిస్తున్న ఎన్‌సీసీ నాయకులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని మదర్‌థెరిస్సా విగ్రహం వద్ద నేషనల్ క్రైస్తవ కౌన్సిల్ (ఎన్‌సీసీ) పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం ఆమె జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కౌన్సిల్ నాయకులు పి.ఐజాక్ బ్రెన్హమ్, కె.బ్లెస్సింగ్ రాజు అధ్యక్షతన పేదవర్గాలకు బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. కౌన్సిల్ నాయకులు కేఎస్.రాజు, కె.డేవిడ్‌బాబు, ఎస్.కృపావరం థెరిస్సా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఒ.మనోజ్ బాబు మాట్లాడుతూ మదర్‌థెరిస్సా నిరుపేదల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలన్నారు. ఆమె చూపిన సేవా మార్గం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

అత్తిలిలో 80 గణపతి మండపాలకు అనుమతి

అత్తిలి: మండలంలో వినాయక చవితి సందర్భంగా 80 వినాయక మండపాలు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు అత్తిలి ఎస్సై పి.ప్రేమరాజు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి మండపాలను పరిశీలించి అనుమతులు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండపాలను నిర్వహించాలని కోరారు. అశ్లీల కార్యక్రమాలు నిర్వహించరాదని విపరీతమైన ధ్వనులు వచ్చే వాయిద్యాలను వాడరాదని ఆయన కోరారు. ఉత్సవాల నిర్వహణకు కమిటీల వారే బాధ్యత వహించాలని ఎస్సై కోరారు.

చవితికి సర్వం సిద్ధం

- ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి
- పోలీసుల అనుమతి పొందాలి
- అవాంఛనీయ ఘటనలకు తావు ఉండకూడదు



తాడేపల్లిగూడెం అబ్బులు కొట్టు సెంటర్‌లో ఉత్సవ పందిరికి వినాయకుని భారీ విగ్రహాన్ని తీసుకొచ్చిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలోని వినాయక చవితి ఉత్సవ పందిళ్లకు వినాయకుని విగ్రహాలు సోమవారం రాత్రికే చేరుకున్నాయి. పెద్ద సంఖ్యలో విగ్రహాలను నిర్వాహకులు పందిళ్లకు తీన్మార్ డప్పుల మధ్య తీసుకొచ్చారు. కాగా, వినాయక చవితిని పురస్కరించుకుని ఉత్సవ పందిళ్ల వద్ద మిరిమిట్లు గొలిపే రంగు రంగుల విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆయా ప్రాంతాలు విద్యుద్దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. వినాయకుని పూజకు చిన్న విగ్రహాలు రూ.50లు, నాలుగున్నర అడుగులు రూ.6వేలు, మూడు అడుగులు రూ.2500 నుంచి రూ.3వేలు వరకు విక్రయించారు. చామంతి పువ్వులు పావు కిలో రూ.150లు, కొబ్బరి కాయలు 25 నుంచి 30 రూపాయలు, మొక్కజొన్న పొత్తు అరడజను రూ.100లు, మారేడు కాయ రూ.10లు, బత్తా కాయ రూ.10లు, నారింజ కాయ రూ.10లు, యాపిల్స్ డజను రూ.200లు, పత్రి రూ.20లు, పాలవెల్లి రూ.50లు, గొడుగులు 50 నుంచి 100 రూపాయల వరకు మంగళవారం విక్రయించారు. పూజా సామాగ్రి కొనుగోలుదారులతో తాడేపల్లిగూడెం పట్టణం కోలాహలంగా మారింది.



మాధవరం వినాయక చవితి ఉత్సవ పందిరి వద్ద రంగు రంగుల విద్యుద్దీపకాంతులు



వినాయక చవితి పూజకు పండ్లు కొనుగోలు చేస్తున్న దృశ్యం



ఇరగరంలో మార్కెట్‌లో పత్రి అమ్ముతున్న దృశ్యం

మార్కెట్‌లో వినాయక చవితి సందడి

ఇరగవరం: మండలంలోని 21గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో మార్కెట్లో వినాయక చవితి సందడి నెలకొంది. చవితి పూజకు పత్రులు, పూజా సామగ్రిని పెద్ద ఎత్తున భక్తులు కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో పెద్ద, పెద్ద వినాయకుని విగ్రహాలు, ఒక పక్క, మరొక ప్రక్క మట్టి వినాయకుని విగ్రహలను వినాయక చవితి మండపాలకు తరలించారు. ఆయా గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

లేబర్ కోడ్‌లు నిలుపుదల చేయాలి



తణుకులో సీఐటీయూ జెండాను ఆవిష్కరించిన ప్రతాప్ తదితరులు

తణుకు అర్బన్: కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు నిలుపుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద సీఐటీయూ 4వ మహాసభని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ మహా సభకు ముఖ్య అతిధిగా హాజరైన ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షురాలు ఏ. అజయకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ ఉద్యోగ, కార్మికులకు చాలా ప్రమాదకరమైనవని అన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు నేటికీ అమలు చేయక పోవడం శోచనీయమన్నారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, స్కీమ్ వర్కర్స్‌కి కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 12 గంటల పనిని వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో జరిగే పరిణామాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. ముందుగా సీఐటీయూ జెండాను ప్రతాప్ ఆవిష్కరించగా, గడిచిన మూడు సంవత్సరాలుగా నిర్వహించిన కార్యక్రమాలు కార్యదర్శి గుబ్బల గోపి వివరించారు. యస్. ఆదినారాయణ బాబు, ఎం.మధు షీల అధ్యక్షులుగా వ్యవహరించిన ఈ మహాసభలో పీఎల్. నరసింహారావు, పి. దక్షిణా మూర్తి, గార రంగారావు, వల్లూరి వెంకటేశ్వరావు, ఐద్వా కార్యదర్శి కె. నాగరత్నం, ఎం. రమేష్, శివ కుమార్, రవి రామకృష్ణ, ఎస్.చిన్నారావు, ఎ.రామకృష్ణ, ఎం. గంగాధర్ రెడ్డి, రమేష్ జ్యోతి బాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం



ద్వారకా తిరుములరావుకు విన్నవిస్తున్న విశ్రాంత కార్మికులు, యూనియన్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తనను కలిసిన విశ్రాంత ఎంప్లాయిస్ నేతలకు హామీ ఇచ్చారు. పట్టణానికి మంగళవారం విచ్చేసిన తిరుములరావుకు ఏపీ విశ్రాంత ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధి బృందం కలిసి వినతి అందజేశారు. స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్‌లో విశ్రాంత ఉద్యోగులకు ఇస్తున్న పెన్షన్‌ను ప్రతి నెల ఒకటో తేదీనే ఇవ్వాలని, విశ్రాంత ఉద్యోగులకు ఇస్తున్న పెన్షన్ ప్రతి నెల ఒకటో తేదీనే ఇవ్వాలని, విశ్రాంత ఉద్యోగులకు జీవిత భాగస్వామితో సహా సూపర్ లగ్జరీ బస్సులలో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. తిరుములరావు సానుకూలంగా స్పందించారు. తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎ.నరసింహారావు, ఓసూరి వీర్రాజు, ఆర్‌ఎస్ కుమార్, జి.వెంకట్రావు, జి.సోమేశ్వరరావు, ఆలమూరు సత్యనారాయణ, మద్దుకూరు కోటేశ్వరరావు, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: పేకాట స్థావరంపై దాడి చేసి, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై జేవీఎస్.ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుంచనపల్లి చెరువు గట్టున పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.64,140లు నగదు, ఐదు మోటారు సైకిళ్లు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నాణ్యతతో పనులు జరగాలి



బంగారుగూడెంలో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి గిరి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన నిర్మిస్తున్న వాటర్ ట్యాంకును నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వి.వి.గిరి సూచించారు. మంగళవారం మండలంలోని బంగారుగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు ఐరన్ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈ సోమేశ్వరరావు, ఏఈ రాజా శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది ఉన్నారు.

29న ఏఎస్ఎన్ఎం కళాశాలలో జాబ్‌మేళా

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ నేషనల్ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఉద్యోగ దిక్సూచి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ నెల 29న శుక్రవారం మెగా జాబ్‌మేళా ఏర్పాటుచేశామని చెప్పారు. డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన నిరుద్యోగులు తమ బయోడెటా, సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు కళాశాలలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఎస్ఆర్ఐఏఎస్ఎన్ఎంజీడీసీపీఏఎల్ఏకేవోఎల్ డాట్ ఏసీ డాట్ ఐఎన్‌లో పొందుపరిచామని తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసి, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, బీటీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, కామెంట్ స్టాపింగ్ సొల్యూషన్స్, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

దివ్యాంగులపై కక్ష విడనాడాలి

ఆర్‌సీడీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న రెడ్డి సంఘ ప్రతినిధులు

పెంటపాడు: దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం వివక్షను విడనాడాలని రెడ్డి కమ్యూనిటీ డవలప్‌మెంట్ సొసైటీ (ఆర్‌సీడీఎస్) జిల్లా అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతంశెట్టి లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి సురేష్‌రెడ్డిలు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దివ్యాంగులను ఆదుకొనేందుకు ప్రత్యేక శ్రద్ధ కనపర్చిందన్నారు. నేడు వారిని ఆదుకొనేందుకు కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే రెడ్డి కార్పొరేషన్ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ ఎంఎస్ -6 ప్రకారం రెడ్ల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వాలు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కేశవ స్వామి మరియు మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానము
తణుకు పట్టణం, తణుకు మండలం, ప.గో.జిల్లా.

మెరక భూమిని లీజుకు యిచ్చుటకు సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

[illegible]

క్ర.సం.	ఆర్.యస్. నెం.	విస్తీర్ణం	ధరావత్తు	లీజు కాలము	వేలం జరుగు ప్రదేశము, తేది, సమయము
1.	452/1	0-28 సెం.	రూ. 10,000/-	2025-26 to 2027-28	తేది.6-9-2025 ఉ॥ గం॥ 11-00 లకు శ్రీ స్వామి వారి ఆలయము నందు

ముఖ్యషరతులు : 1. [illegible] 2. [illegible] 3. [illegible]

ప్రదేశం: తణుకు
తేది.26-08-2025

సం/- ముత్యాల సత్యనారాయణ
కార్యనిర్వహణాధికారి

జై గణేశా.. పర్యావరణ హితానికి సై



తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక ప్రతిమలతో చిన్నారులు, హెచ్ఎం పద్మావతి



అత్తిలి మండలం బల్లిపాడు స్కూల్‌లో విద్యార్థులకు మట్టి గణపతి ప్రతిమలను అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు మట్టితో వినాయక ప్రతిమలను తయారుచేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు మట్టితో వినాయక ప్రతిమలను చేశారని హెచ్ఎం కె.పద్మావతి తెలిపారు. అనంతరం మట్టి విగ్రహాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. సోమేశ్వరరావు, జె.ఉమాదేవి, జి.పాల్ డేవిడ్ రాజు, కె.పాపారావు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపతిని ఆరాధిస్తే ప్రకృతిని ఆరాధించినట్లే

అత్తిలి: గణపతిని ఆరాధిస్తే ప్రకృతిని ఆరాధించినట్లేనని పాఠశాల డైరెక్టర్ తిరుపతి శ్రీనివాస్ అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు మదన గోపాల్ స్కూల్‌లో మంగళవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన వినాయక ప్రతిమలనే పూజించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ మట్టి గణపతి ప్రతిమలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాడిగ నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఆకుల శ్రీనివాసరావు, మదన గోపాల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు శివకృష్ణ, ప్రిన్సిపాల్ అనిత, వైస్ ప్రిన్సిపాల్ కుమారి, టి. గీతా భారతి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎస్‌పురం పాఠశాలలో .... పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, వినాయక చవితికి మట్టి విగ్రహాలని వాడాలని లక్ష్మీనారాయణ పురం ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవి సుబ్బరాజు అన్నారు. విద్యార్థులచే తెలుగు ఉపాధ్యాయుడు శ్రీనివాస బాబు వినాయక చవితి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): వినాయక చవితి సందర్భంగా రజక సేవా సంఘం కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. రజక సంఘం నాయకులు అడ్డాల నరసింహారావు, యండమూరి మహేష్, పసుపులేటి శ్రీనివాస్, వి.శ్రీను, ఎస్.నాగేంద్ర, నాగలక్ష్మి, జగదీష్, అడ్డాల సత్యనారాయణ, వుండరయ్య పాల్గొన్నారు.

పెంటపాడు: వినాయక చవితి పురస్కరించుకొని ప్రత్తిపాడు ట్రిబుల్ కర్మాగారంలో కార్మికులకు మంగళవారం మట్టి ప్రతిమలను యాజమాన్యం ఉచితంగా పంపిణీ చేసింది.



పెంటపాడులో ట్రిబుల్‌ఎఫ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం



రజక కమ్యూనిటీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ కార్యక్రమం